క్లుప్తంగా

ఈజీఎస్ గ్రామసభలు



గ్రామసభ నిర్వహిస్తున్న దృశ్యం

శివ్వంపేట(నర్సాపూర్): జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన పనులపై సోషల్ ఆడిట్ గ్రామాల్లో ముమ్మరంగా జరుగుతున్నాయి. ఉపాధిహామీలో 2019 నుంచి 2023 మార్చి వరకు చేసిన పనులపై సోషల్ ఆడిట్ చేస్తున్నారు. అందులో భాగంగా శివ్వంపేటలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో చేపట్టిన పనుల గురించి వివరాలు సేకరించారు. ఈ నెల 29న మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద ప్రజాదర్బార్ జరుగుతుందని ఎంపీడీఓ నవీన్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కార్యదర్శులు, సోషల్ ఆడిట్ సిబ్బంది ఉన్నారు.

సమ్మర్ శిబిరానికి స్పందన

నర్సాపూర్: నర్సాపూర్‌లోని అల్లూరి సీతారామరాజు గిరిజన గురుకుల ఫైన్ ఆర్ట్స్ పాఠశాలలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వేసవి శిబిరానికి మంచి స్పందన ఉందని గిరిజన గురుకులాల రీజనల్ కోఆర్డినేటర్ సంపత్‌కుమార్ చెప్పారు. ఆయన మంగళవారం స్థానిక శిబిరానికి సందర్శించారు. వేసవి శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు ఆయా సబ్జెక్టుల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో శిక్షణ అందజేస్తున్నామని తెలిపారు. వెస్ట్రన్ డ్యాన్స్‌లైఫ్ స్కిల్స్, సాఫ్ట్‌బాల్ తదితర రంగాల్లో శిక్షణ ఇస్తు న్నామని ఆయన చెప్పారు. శిక్షణ శిబిరంలో చేపడుతున్న శిక్షణ వివరాలను పాఠశాల ప్రిన్సిపాల్ భిక్షమయ్య కోఆర్డినేటర్‌కు వివరించారు.

కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలి



జెడ్పీ చైర్‌పర్సన్ హేమలతకు వినతిపత్రం అందిస్తున్న వీఓఏలు

మనోహరాబాద్(తూప్రాన్): కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు తమ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లాలని జెడ్పీ చైర్‌పర్సన్ హేమలతకు మండల ఐకేపీ వీఓఏలు వినతిపత్రం అందజేశారు. మంగళవారం వీఓఏలు మండల కేంద్రంలో నిరసన దీక్ష చేపట్టారు. అదే సమయంలో అటుగా వెళ్తున్న జెడ్పీ చైర్‌పర్సన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వీరి వెంట ఎంపీపీ పురం నవనీతరవి, ఆత్మ కమిటీ డైరెక్టర్ భిక్షపతి, మండల బీఆర్‌ఎస్ ఉపాధ్యక్షుడు రతన్‌లాల్, రమేశ్‌గౌడ్, సాయి తదితరులున్నారు.

సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి

మెదక్ కలెక్టరేట్: ఐకేపీ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కరాములు డిమాండ్ చేశారు. మంగళవారం మెదక్ కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వీఓఏలకు మద్దతు తెలిపారు. కనీస వేతనం, గుర్తింపు కార్డులు, యూనిఫామ్స్ అందించాలని కోరారు. వీఓఏల సమ్మెకు వైఎస్సార్ టీపీ నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహేందర్ రెడ్డి, బస్వరాజు, ఉపాధ్యక్షుడు మల్లేశం, కదారి నాగరాజు పాల్గొన్నారు.

స్టూడెంట్ చాప్టర్ ప్రారంభం

నర్సాపూర్: నర్సాపూర్‌లోని బీవీ రాజు ఇంజనీరింగ్ కాలేజీలో మంగళవారం స్టూడెంట్ చాప్టర్ ప్రారంభించారు. వరల్డ్ ఎర్త్‌డే – 2023, ఇండియన్ కాంక్రీట్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో స్టూడెంట్ చాప్టర్ ఏర్పాటు చేశారు. కాగా ఐసీఐ హైదరాబాద్ సెంటర్ చైర్మన్ డాక్టర్ వెంకటేశ్వరరావు, మహీంద్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ విశాలాక్షి ముఖ్య అతిథులుగా పాల్గొని సెంటర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో కాలేజీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ జగన్, సివిల్ ఇంజనీరింగ్ హెచ్‌ఓడీ డాక్టర్ కృష్ణారావు, మేనేజర్ బాపిరాజు తదితరులు పాల్గొన్నారు. కాగా ముఖ్య అతిథులు సివిల్ ఇంజనీరింగ్ డిపార్టుమెంట్‌లోని ల్యాబరేటర్లను పరిశీలించారు.

రెండో విడత గొర్రెల పంపిణీని విజయవంతం చేయాలి

చేగుంట(తూప్రాన్): రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి జయరాజ్ అన్నారు. చేగుంట ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. మండలంలోని గొర్ల కాపరులకు ప్రభుత్వం గొర్రెల పంపిణీ త్వరలోనే చేయనున్నట్లు తెలిపారు. దీనికోసం లబ్ధిదారులు తమ వాటా డబ్బులను కలెక్టర్ ఖాతాలో జమ చేయాలన్నారు. కార్యక్రమంలో పశు సంవర్థక శాఖ ఏడీ తిరుపతి, తహసీల్దార్ లక్ష్మణబాబు, ఎంపీడీఓ ఆనందమేరీ, పశు వైద్యాధికారి శ్రీనివాస్, ఆయా గ్రామాల గొర్ల కాపరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కౌడిపల్లి(నర్సాపూర్): ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మండల కేంద్రం కౌడిపల్లిలో సోమవారం పీహెచ్‌సీ డాక్టర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. మలేరియాపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం శ్రీధర్‌రెడ్డి వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

అల్లాదుర్గంలో..

అల్లాదుర్గం(మెదక్): ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మండలంలోని గడిపెద్దాపూర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గడిపెద్దాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది రవీందర్, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు సంతోషంగా ఉండాలి

- నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి
- ఘనంగా ఎల్లమ్మకు బోనాలు



కౌడిపల్లి: ఎల్లమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి



టేక్మాల్: బోనాలను ఊరేగిస్తున్న భక్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): అమ్మవారి దయతో ప్రజలు సంతోషంగా ఉండాలని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని తునికి రేణుకా ఎల్లమ్మ పంచమ వార్షికోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎల్లమ్మ దయతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలన్నారు. గ్రామ గౌడసంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఒగ్గుపూజారులు అమ్మవారి కల్యాణం నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా బోనాలను తీసి, మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, జిల్లా కోఆప్షన్ సభ్యుడు మన్సూర్, నర్సాపూర్ మున్సిపల్ కౌన్సిలర్ అశోక్‌గౌడ్, సర్పంచ్ సాయిలు, ఉపసర్పంచ్ మానిక్యారెడ్డి, మాజీ సర్పంచ్ సాయగౌడ్, నల్లపోచమ్మదేవి ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్‌రెడ్డి, మాజీ చైర్మన్ మల్లేశం, నాయకులు రఘువీరారెడ్డి, ప్రవీణ్‌గౌడ్, పాషా, అమర్‌సింగ్, శ్రీకాంత్‌గౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి, చల్ల కుమార్, రాజేందర్, రాకేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

టేక్మాల్(మెదక్): మండలంలోని కుసంగి గ్రామంలో గౌడసంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మకు బోనాలు ఊరేగించారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, అర్చన వంటి ప్రత్యేక పూజలతో పాటూ కుంకుమార్చన నిర్వహించారు. సాయంత్రం వేళల్లో వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

జాతీయ స్థాయిలో బీఆర్‌ఎస్ జెండా ఎగరడం ఖాయం

జెడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలత



మనోహరాబాద్‌లో జెండావిష్కరణ చేస్తున్న మండలాధ్యక్షుడు పురం మహేశ్, తదితరులు

మనోహరాబాద్(తూప్రాన్): జాతీయ స్థాయిలో బీఆర్‌ఎస్ జెండా ఎగరడం ఖాయమని జెడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలత అన్నారు. మంగళవారం మనోహరాబాద్ మండల కేంద్రంలో జెండావిష్కరణలో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కాగా మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పురం మహేశ్ జెండావిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఇప్పుడు దేశ రాజకీయాల్లో కీలకంగా మారారని, మహారాష్ట్రలో బ్రహ్మరథం పడుతున్నారన్నారు. అనంతరం దండుపల్లి మల్లన్న దేవాలయం నుంచి పలు గ్రామాల నుంచి వచ్చిన నాయకులు బైక్ ర్యాలీతో గజ్వేల్‌లో జరిగిన సభకు తరలివెళ్లారు. కాళ్ళకల్‌లో ఎంపీపీ నవనీత, రంగాయపల్లిలో వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, సర్పంచ్ నాగభూషణం, చెట్లగౌరారంలో తూప్రాన్ పీఏసీఎస్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, సర్పంచ్ నర్సయ్య, మనోహరాబాద్‌లో సర్పంచ్ మహిపాల్‌రెడ్డిలు జెండావిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, వెంకటేష్, భిక్షపతి, నరేష్, ఇర్ఫాన్, రాహుల్, రమేశ్‌గౌడ్, రమేశ్, నరేశ్‌గౌడ్, బాలేశ్‌యాదవ్, మల్లేశ్, తదితరులున్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు

రామాయంపేట(మెదక్): రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలతో రైతులు తీవ్ర ఆందోళన పడుతున్నా ప్రభుత్వం ఎంతమాత్రం పట్టించుకోవడంలేదని యువజన కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి ఆరోపించారు. ఆయన మంగళవారం పార్టీ కార్యకర్తలతో కలిసి ప్రగతి ధర్మారం శివారులో రహదారిపై ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. 15 రోజులుగా రైతులు ధాన్యాన్ని రోడ్డుపై ఆరబోస్తూ అకాల వర్షంతో తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, ఈ విషయమై త్వరలో పార్టీ తరఫున పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

నేడు కలెక్టర్, ఎమ్మెల్యే పర్యటన

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని గోమారంలో బుధవారం పలు అభివృద్ధి పనులు ప్రారంభించేందుకు జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి వస్తున్నారని మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు లావణ్యారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు గ్రామంలో వివిధ కాలనీల్లో నూతనంగా వేసిన సీసీ రోడ్లు ప్రారంభించడంతో పాటు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారని చెప్పారు.

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం వెల్దుర్తిలో బుధవారం ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, కలెక్టర్ రాజర్షిషా పర్యటించనున్నట్లు పీఏసీఎస్ సీఈఓ సిద్ధయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో సొసైటీ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఉదయం 10 గంటలకు వారు ప్రారంభిస్తారని తెలిపారు.

లబ్ధిదారులకు అవగాహన

శివ్వంపేట(నర్సాపూర్): గొర్రెల యూనిట్ల పంపిణీ గురించి లబ్ధిదారులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నవీన్‌కుమార్ తెలిపారు. మండలానికి మంజూరైన గొర్రెల యూనిట్ల గురించి లబ్ధిదారులతో బుధవారం ఉదయం 11 గంటలకు మండలంలోని చండిలోని జెఎస్‌ఆర్ ఫంక్షన్‌హాల్‌లో అవగాహన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ రాజర్షిషాతో పాటు ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ హాజరవుతున్నట్లు చెప్పారు.

బగలాముఖీ ఆలయంలో పూజలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో కొలువైన బగలాముఖీ శక్తిపీఠంలో మంగళవారం రాత్రి విశేష పూజలు నిర్వహించారు. బగలాముఖీ ఉపాసకుడు, వేద పండితుడు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ నెల 28న బగలాముఖీ జయంతి (విజయేత్సవ దినోత్సవం) సందర్భంగా పంచామృతాభిషేకం, పంచదశ మహాఖడ్గతంత్రార్గత, హరిద్రార్చన నిర్వహిస్తామని వెంకటేశ్వరశర్మ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మ కృపకు పాత్రులు కావాలని కోరారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై ప్రజలకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్

నర్సాపూర్: మున్సిపాలిటీ పరిధిలో స్వచ్ఛ సర్వేక్షణ్‌పై చేపడుతున్న కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని 1, 9, 13 వార్డుల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తడి, పొడి, హానికర చెత్తను వేరు చేసి ఇవ్వాలని పట్టణ ప్రజలను కోరారు. చెత్త సేకరించేందుకు మున్సిపాలిటీ వాహనాలు వచ్చినప్పుడు ప్రతీ ఒక్కరు చెత్తను వేరు చేసి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పట్టణంలోని ఆయా వార్డుల కౌన్సిలర్లు అశోక్‌గౌడ్, సునీత తదితరులు పాల్గొన్నారు.

ఆర్టిజన్ల సమస్యలు పరిష్కరించాలి



పెద్దశంకరంపేట(మెదక్): పోలీసుల అదుపులో ఆర్టిజన్లు



నర్సాపూర్: నినాదాలు చేస్తున్న ఆర్టిజన్ ఉద్యోగులు



చిన్నశంకరంపేట(మెదక్): గవ్వలపల్లి సబ్‌స్టేషన్ ఎదుట.

మెదక్‌జోన్: డిమాండ్ల సాధన కోసం మంగళవారం విద్యుత్ శాఖలో పనిచేసే ఆర్టిజన్‌లుగా విధులు నిర్వర్తించే వారు విధులు బహిష్కరించి సమ్మెకు దిగారు. ఇందులో ప్రధానంగా తెలంగాణ విద్యుత్(యూనియన్)వారు ఆర్టిజన్‌లు ఈ సమ్మెలో పాల్గొన్నారు. కాగా విషయం తెలుసుకున్న పోలీసులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ముందస్తుగా సమ్మెకు దిగిన వారిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు.

పెద్దశంకరంపేట(మెదక్): న్యాయమైన తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సమ్మెలో పాల్గొన్న ఆర్టిజన్లను పోలీసులు అదుపులోనికి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో అశోక్, కృష్ణకుమార్, సదాశివ, ప్రవీణ్‌కుమార్, గోపాల్ తదితరులున్నారు.

నర్సాపూర్: తమ సమస్యల పరిష్కరించాలని సమ్మె చేస్తున్నామని రాష్ట్ర విద్యుత్ ఆర్టిజన్ ఐక్య కార్యాచరణ కమిటీ నర్సాపూర్ సెక్షన్ అధ్యక్షుడు నాగరాజు చెప్పారు. మంగళవారం నుంచి నిరవధిక సమ్మె చేపట్టామని అన్నారు. తమ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు.

చిన్నశంకరంపేట(మెదక్): తెలంగాణ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మండలంలో విద్యుత్ కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు.

పాపన్నపేట(మెదక్): విద్యుత్ ఉద్యోగుల నిరవధిక సమ్మె దృష్టిలో పెట్టుకొని పాపన్నపేటలో ఆర్టిజన్లను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి, సాయంత్రం విడిచి పెట్టారు. అదుపులోకి తీసుకున్న వారిలో సంగయ్య, యాదగిరి, రాములు, సంతోశ్‌రెడ్డి, గంగారాం, రత్నయ్య, నరేష్, శ్రీను, మహేశ్ ఉన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు

చిన్నశంకరంపేట(మెదక్): శాంతి భద్రతల పరిరక్షణ కోసం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించామని రామాయంపేట సీఐ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చందాపూర్ గ్రామంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ.. కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రామ్ ద్వారా గ్రామంలో ఎవరైనా కొత్త వ్యక్తులు, నేరస్తులు గానీ వచ్చి షెల్టర్ తీసుకుంటున్నారా అనే విషయం కూడా తెలుస్తుందన్నారు. ఎవరైనా ప్రజా శాంతికి భంగం కలిగించేలా ప్రవర్తిస్తే వెంటనే పోలీసులకు లేదా డయల్ 100 కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటుకు విరాళాలు అందించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు సుభాష్ గౌడ్, ప్రకాష్ గౌడ్, నర్సింలు, రంజిత్, శ్రీనివాస్ రెడ్డి, 35 మంది పోలీసులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **మన ఊరు – మనబడి పనులు ప్రారంభం**

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్న ఉన్నత పాఠశాలలో మన ఊరు – మనబడి పనులకు సర్పంచ్ కాజిపేట రాజేందర్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు బుచ్చిరెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు ప్రవళిక, అఖిల, ఎస్‌ఎంసీ చైర్మన్ వెంకటేశం, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

◆ **మైక్‌సెట్ అందజేత**

చేగుంట(తూప్రాన్): మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామంలో గంగమ్మ ఆలయానికి వేంకటేశ్వర ఆలయ ధర్మకర్త కిషన్‌రావు మైక్‌సెట్‌ను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాములు, గంగపుత్ర నాయకులు బాలపోచయ్య, పెద్దల నర్సింలు, గోపాల్, అశోక్, నర్సింలు, కోటయ్య, బాలయ్య, నాగులు తదతరులు ఉన్నారు.

◆ **పోచమ్మ తండాలో స్వశక్తి కరణ్ అభియాన్**

నర్సాపూర్ రూరల్: మండలంలోని జివ్వి పోచమ్మ తండాలో స్వశక్తి కరణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా అసెంబ్లీ బీజేపీ కన్వీనర్ వాల్దాస్ మల్లేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో నూతన కమిటీ వేశారు. ఈ సందర్భంగా తండాకు చెందిన యువకులు హరిసింగ్, శంకర్, పవన్‌కుమార్, గణేశ్, ప్రశాంత్, శ్రీకాంత్, రామ్‌సింగ్, సురేష్, శ్రీనివాస్, పవన్, జైసింగ్, మదన్, భిక్షపతి, గోపాల్, నవీన్ తదితరులు పార్టీ లో చేరారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి నాగేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **తడిసిన ధాన్యం పరిశీలన**

చేగుంట(తూప్రాన్): మండలంలోని రెడ్డిపల్లి శివారులో అకాల వర్షంతో తడిసిన ధాన్యాన్ని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు మంగళవారం రాత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ఎమ్మెల్యే మాట్లాడి, తమకు జరిగిన నష్టం గురించి వివరించారు. అధికారులు పర్యటనలకే పరిమితం కాకుండా రైతులతో పాటు అకాల వర్షకు నష్టపోయిన బాధితులకు పరిహారం అందించాలన్నారు. ఈ పరిశీలనలో బీజేపీ మండలాధ్యక్షుడు భూపాల్, నాయకులు గోవింద్, బాల్‌చందర్, నాయకులు, రైతులు ఉన్నారు.

స్వచ్ఛభారత్ మిషన్‌పై రెండో విడత శిక్షణ



రామాయంపేట: మ్యాప్ చూపుతున్న కార్యదర్శి

రామాయంపేట(మెదక్): మండలంలోని బహిరంగ మల విసర్జన రహిత (ఓడీఎఫ్) గ్రామంగా ఎంపికైన సుతారిపల్లి గ్రామంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, మరుగుదొడ్ల వినియోగం, శానిటేషన్, తదితర విషయాల గురించి ఇతర గ్రామలకు చెందిన కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. స్వచ్ఛ భారత్ మిషన్ (ఎస్‌బీఎం) రెండో విడత శిక్షణలో భాగంగా ఎంపీడీఓ ఉమాదేవి, ఏపీవో శంకర్, సర్పంచ్ రాగి సంధ్య, ఇతర కార్యదర్శులు గ్రామంలోని ప్రతీ ఇంటికి తిరిగి మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు , చెత్త బుట్టలు వాడుతున్నారా, తడి, పొడి చెత్త వేరు చేస్తున్నారా అనే విషయమై వారు సర్వే నిర్వహించారు. నార్సింగి టీఏ రాజేందర్, ఎస్‌బీఎం ఇలియాజ్, మెదక్ ఎంపీవో ప్రశాంత్ ఆధ్వర్యంలో ఆరు టీంలు 40 ఇళ్ల చొప్పున సర్వే నిర్వహించాయి. గ్రామంలో మొత్తం 256 ఇళ్లు ఉండగా, వీటిలో కేవలం ఆరు ఇళ్లలో మాత్రమే మరుగుదొడ్లు నిర్మించుకోలేదని సర్వేలో తేలింది. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి పద్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, పాల్గొన్నారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): స్వచ్ఛభారత్ మిషన్–2 శిక్షణలో భాగంగా అధికారులు రెండోరోజు మండల పరిధిలోని శీలాంపల్లి గ్రామంలో క్షేత్ర పర్యటన నిర్వహించారు. మంగళవారం ఎంపీడీఓ శశిప్రభ, కొల్చారం ఏపీఓ మహిపాల్‌రెడ్డి, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, ప్రజాప్రతినిధులు శీలాంపల్లి గ్రామాన్ని సందర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ కవిత, ఏపీఓ శ్యాంకుమార్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటిన ఈద్ మిలాప్



ఈద్ మిలాప్‌కు హాజరైన మత పెద్దలు

ఆకట్టుకున్న ప్రసంగాలు

మెదక్‌జోన్: పట్టణంలో ఈద్ మిలాప్ కార్యక్రమం ఆకట్టుకుంది. కాంగ్రెస్ నేత మహమ్మద్ హఫీజ్ ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సర్వమత పెద్దలు హాజరై తమ సందేశాన్ని అందించారు. సోమవారం రాత్రి పట్టణంలోని ద్వారకా గార్డెన్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. హిందూ, ముస్లిం, క్రైస్తవ మత గురువులు పాల్గొని దైవ సందేశాన్ని వినిపించారు. సర్వ మతాల సారం ఒకటేనని, అందరి మతం మానవత్వమేనని మత పెద్దలు చాటి చెప్పారు. ఈ కార్యక్రమంలో అన్ని రాజకీయ పక్షాలకు సంబంధించిన నేతలు పాల్గొన్నారు. కుల, మత, వర్గ లింగ భేదాలు లేకుండా సమాజంలో అన్యోన్యత భావం ఏర్పడాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మత గురువులు పరస్పరం సన్మానించుకున్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ నాయకులు సుప్రభాతారావు, మ్యాడం బాలకృష్ణ, రామాయంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, జామా మసీదు కమిటీ అధ్యక్షుడు మొహమ్మద్ అఫ్జల్, హిందూ మత అర్చకులు మధు పంతులు, వైద్య శ్రీను, లక్ష్మణ్, లింగమూర్తి, క్రైస్తవ మత గురువులు డేవిడ్, జైపాల్, శ్రీనివాస్ ముస్లిం మత గురువులు జావిద్ మౌలానా, సయ్యద్ ఖాజా మోహిజొద్దీన్, జమీల్, ఆరిఫ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ జెండా ఆవిష్కరణలు



నర్సాపూర్: జెండా ఎగుర వేస్తున్న ఎమ్మెల్యే, పక్కన ఎమ్మెల్సీ ఇతర నాయకులు



శివ్వంపేటలో ..



తూప్రాన్: పట్టణంలో..

నర్సాపూర్: నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో పార్టీ జెండాలు ఎగుర వేస్తున్నారని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఉదయం పట్టణంలోని చౌరస్తాలో పార్టీ జెండాను ఆయన ఎమ్మెల్సీ మల్లేశంతో కలిసి ఎగురవేశారు. కార్యక్రమంలో అసంఘటిత కార్మిక బోర్డు చైర్మన్ దేవేందర్‌రెడ్డి, జెడ్పీటీసీ బబియానాయక్, పలువురు పార్టీ నాయకులు చంద్రాగౌడ్, మన్సూర్, వెంకట్‌రెడ్డి, శేఖర్, భిక్షపతి పాల్గొన్నారు.

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో నిర్వహించిన జెండా ఆవిష్కరణలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రమణగౌడ్, ఎంపీపీ హరికృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు మాధవారెడ్డి, కల్లూరి హన్మంత్‌రావు, రాజశేఖర్‌గౌడ్, రాంమోహన్‌రెడ్డి, రవినాయక్, గంగాధర్, హరిశంకర్‌గౌడ్, నగేశ్వర్‌రావు, సత్యం, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రామాగౌడ్, ఎంపీపీ రాజునాయక్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిన్నంరెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు హైమద్, యూత్ అధ్యక్షుడు కృష్ణాగౌడ్, నాయకులు అమర్‌సింగ్, రాజిరెడ్డి, కురుమ శేఖులు, కిషోర్‌గౌడ్, శాఖయ్య, శెట్టయ్య, మల్లేశం, జగన్, తిరుమలేశ్, మోతిలాల్‌గౌడ్, శ్రీనివాస్‌గుప్తా, తదితరులు పాల్గొన్నారు.


చేగుంట(తూప్రాన్): మండలంలోని పలుగ్రామాల్లో బీఆర్‌ఎస్ జెండావిష్కరణ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. చేగుంటలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వెంగళరావు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు శ్రీనివాస్, ఎంపీటీసీ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో గ్రామ శాఖ అధ్యక్షుడు జెండాను ఆవిష్కరించారు. అనంతరం దుబ్బాకలో నిర్వహించిన పార్టీ ప్రతినిధుల సభకు తరలి వెళ్లారు.

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ స్వరూప, జెడ్పీటీసీ రమేశ్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


టేక్మాల్(మెదక్): మండలంలోని అన్ని గ్రామాల్లో బీఆర్‌ఎస్ పార్టీ జెండాలను ఎగరవేసిన వారిలో మండలాధ్యక్షుడు వీరప్ప, నాయకులు శ్రీధరచారి, చింతరవి, సిద్ధయ్య, భాస్కర్, శ్రీధరచారి, సలీమ్, గోవిందచారి, సత్యం, సరేష్, వసీమ్, సల్లాఉద్దిన్, మాణిక్యం, రాములు, సాయిలు, అశోక్, నాగరాజు, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

పెద్దశంకరంపేట(మెదక్): పేటలోని పార్టీ కార్యాలయం వద్ద నిర్వహించిన జెండా ఆవిష్కరణలో మండలాధ్యక్షుడు మురళిపంతులు, ఎంపీపీ శ్రీనివాస్, జెడ్పీటీసీ విజయరామరాజు, సీనియర్ నాయకులు తదితరులున్నారు.

తూప్రాన్: బీఆర్‌ఎస్ జెండా పండుగను పట్టణంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో జరుపుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా బీఆర్‌ఎస్ జెండాను మున్సిపల్ చైర్మన్ రవీందర్‌గౌడ్ ఆవిష్కరించారు. పట్టణంలోని బీఆర్‌ఎస్ నాయకులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



కొల్చారంలో తడిచిన ధాన్యం చూపుతున్న రైతులు



పాపన్నపేట ధాన్యం కొనుగోలు కేంద్రంలో తడిచిన ధాన్యం

వర్షం బీభత్సం

కొల్చారం(నర్సాపూర్): కొల్చారం మండలం మంగళవారం సాయంత్రం బీభత్సం సృష్టించింది. రంగంపేట వైపు వస్తున్న ట్రాక్టర్‌పై చెట్టు పడడంతో ఇంజన్ దెబ్బతింది. డ్రైవర్ తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. మరోవైపు రంగంపేట పీఏసీఎస్‌లో ధాన్యంపై చెట్ల కొమ్మలు పడ్డాయి. రైతులకు ప్రమాదం తప్పింది.

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో ఈదురుగాలితో కూడిన భారీ వర్షం కురిసింది. కల్లాల వద్ద ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. రహదారిపై పలు చోట్ల చెట్లు విరిగి పడ్డాయి. చిన్నశంకరంపేట మండల కేంద్రంలో పలు చోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగి విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడ్డారు.



చిన్నశంకరంపేటలో కూలిన విద్యుత్ స్తంభం



ఏడుపాయల కమాన్‌వద్ద రోడ్డుపై కూలిన చెట్టు